జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 9-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 158 పేజీలు: 8 వెల: రూ.7

# వేతన.. యాతన


ఫైల్‌ఫోటో

* ఏడాదిగా కిడ్నీ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు
* గత పాలకులు, అధికారుల తప్పిదం వీరి పాలిట శాపం
* ఎప్పుడు జీతం ఇస్తారో చెప్పలేని స్థితిలో కిడ్నీ ఆసుపత్రి ఉన్నతాధికారులు
* పలాస ఎమ్మెల్యేతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఉద్యోగులు
* వేతనాలు అడిగితే మెమోలు ఇస్తున్న ఆసుపత్రి అధికారులు
* ఉద్యోగం చేయలేక, వదలలేక ఆవేదన చెందుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

**శ్రీకాకుళం, నవంబర్ 8(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత కిడ్నీ బాధితులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు శ్రీకాకుళం జిల్లా పలాసలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కిడ్నీ బాధితులకు కార్పొరేట్ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో రూ.50 కోట్లు వెచ్చించి రీసెర్చ్ ఆస్పత్రిని నిర్మించారు. ర్యాంప్ బ్లాక్‌తో కలిపి మూడు బ్లాక్‌లుగా నాలుగు అంతస్తుల్లో ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, వంటి వివిధ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టులు, స్టాఫ్ నర్సు పోస్టులు, ఇతర సహాయ సిబ్బంది పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన వారికి ఏడాది పూర్తయినా జీతాలు ఇవ్వడం లేదు. గత పాలకులు, వైద్యాధికారుల నిర్లక్ష్యం, తప్పిదం వల్ల సిబ్బంది పాలిట శాపంగా మారింది. ఎప్పుడు జీతం ఇస్తారో వైద్యాధికారులు సైతం సరైన వివరణ ఇవ్వడం లేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో వేతనాలు వస్తాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇదే విషయమై కొందరు సిబ్బంది పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు కూడా అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడమేగాకుండా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందేలా చూస్తామని గతంలో హామీ కూడా ఇచ్చారు. అయితే ఆ హామీ నీటిమూటగానే మారిందని కొందరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల విషయమై కిడ్నీ ఆసుపత్రి ఉన్నతాధికారులను సిబ్బంది ప్రశ్నిస్తే.. ఇష్టముంటే పనిచేయండి లేకుంటే వెళ్లిపోండని అంటూనే మెమోలు కూడా జారీ చేస్తామని హెచ్చరికలు చేయడంతో ముందుకెళితే గొయ్యి.. వెనక్కు వెళితే నుయ్యి అన్న చందంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మారింది.

# విషాదం



* కంచిలి మండలంలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు
* ఆర్టీసీ బస్సు కింద పడి ముండలలో బాలుడి మృతి
* పూరీ వెళ్తున్న కారుకు ప్రమాదం
* నలుగురికి గాయాలు

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 8 (వార్త):** కంచిలి మండలంలో శుక్రవారం రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒక చిన్నారి మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు ఘటనలతో కంచిలి మండలంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి ఒడిశాలోని పూరి జగన్నాథ స్వామి దర్శనానికి వెళు తున్న మధురైకి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు కంచిలి మండలం జాడుపూడి శివాలయం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరు వెళుతున్న కారుకు వెనకనుంచి బలంగా లారీ ఢీకొంది. దీంతో కారు పల్టీ కొట్టింది. కార్లో ఉన్న ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అత్యవసర వాహనంలో సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెలుగుదేశం పార్టీ యువ నేత మురపాల ధర్మ యాదవ్ స్వామి క్షతగాత్రుల వివరాలను సేకరించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అలాగే కుమ్మరి నౌగాం నుంచి కంచిలి వస్తున్న ఆర్టీసీ బస్సు ముండల గ్రామాన్ని దాటుతుండగా ఇంట్లోనే ఆటలాడుకుంటున్న దివ్యాంశ్ ప్రధాన్, వీధిలోకి పరుగులెట్టుకుంటూ వచ్చేసి.. ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. దివ్యాంశ్ మృతదేహాన్ని చూసిన తల్లి సంగీత చౌదరి కన్నీరుమున్నీరైంది. ఒకేరోజు కంచిలి మండలంలో జరిగిన ఈ రెండు సంఘటనలు, తీవ్ర ఆందోళనకు గురి చేశాయి. ఈ సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయం చేయకుంటే.. ఆత్మహత్య చేసుకుంటా!



* భర్త ఇంటి ముందు భార్య ధర్నా
* ఎస్పీకి తల్లిదండ్రుల ఫిర్యాదు
* బాధితురాలికి ఎమ్మెల్యే బాసట

**కాశీబుగ్గ, నవంబర్ 8(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలో సుభద్ర నగర్ వీధిలో నివాసముంటున్న తంగుడు హరికృష్ణ ఇంటి ముందు భార్య కవిత ధర్నాకు దిగింది. తన భర్తతో జీవనం సాగేలా చూడాలని, న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని నిరసన తెలిపింది. తన కొడుకు మానసిక వికలాంగుడు కావడంతో భార్య, కొడుకు అవసరం లేదని భర్త బాహాటంగా చెప్పడంతో కవిత తల్లి దండ్రులు, కుటుంబీలకుల సహాయంతో శుక్రవారం భర్త ఇంటి తాళాలు విరగ్గొట్టి ప్రవేశించే యత్నం చేశారు. బాధిత మహిళ కథనం మేరకు శ్రీకాకుళం పట్టణానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు, హైమావతి కుమార్తె కవితకు 2013 సంవత్సరంలో కాశీబుగ్గ (స్టేట్ బ్యాంకు వీధి) సుభద్ర నగర్‌కు చెందిన తంగుడు హరికృష్ణతో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలతో పాటు బంగారు ఆభరణాలు భారీస్థాయిలో అందించారు. వీరి దాంపత్య జీవితం సజావుగా కొన్నాళ్లుపాటు సాగింది. వీరికి కుమారుడు జై శ్రీరామ్ అనే పదేళ్ల బాలుడు ఉన్నాడు. బాలుడు పుట్టిన నాటి నుంచి ఆయన బుద్ధి మాంద్యంతో ఉండడంతో భార్యాభర్తలు మధ్య పొరపొచ్చాలు ప్రారంభమయ్యాయి. అత్తమామలు కూడా భర్తకు వత్తాసు పలకడంతో ఆమె పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారింది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం కవిత పుట్టింటికి వెళ్లింది. ఆమెను భర్తతో పాటు అత్తమామలు తీసుకొని వచ్చే ప్రయత్నం చేయలేదు. దీంతో భార్య కవిత తనకు న్యాయం చేయాలని కుల పెద్దలు ఎదుట విన్నవించుకుంది. కవిత కాశీబుగ్గలోని భర్త ఇంటికి రావడంతో అత్తవారింటివారు ఆమెను బయటకు రానీయలేదు. దీంతో కవితతో పాటు తల్లిదండ్రులు, కుటుంబీకులు ఇంటిబయటే పడిగాపులు కాశారు. చివరకు ఇంటి గేట్లకు ఉన్న తాళాలు విరగ్గొట్టి తల్లిదండ్రులు, కుటుంబీకులు లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. అయినా హరికృష్ణ తల్లిదండ్రుల నుంచి ఎటువంటి స్పందనా లేదు. చివరకు ఇరు వైపులా పెద్దలు సమన్వయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారని తెలుసుకొని కవిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అలాగే బాధితురాలు కవితకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాధితురాలికి ఎస్పీ భరోసా ఇచ్చారని, భార్య భర్తవద్దే ఉండాలన్నారు. బిడ్డ బుద్ధిమాంధ్యంతో పుట్టాడని విడిచిపెట్టాలని భర్త, అత్తమామలు అనుకోవడం అన్యాయమన్నారు. ఆమెకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా తాము తీవ్రంగా స్పందించడం జరుగుతుందని హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 8 (వార్త):** చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ పి.ఈశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శ్రీకాకుళం పట్టణంలో ఒకటవ పట్టణ పరిధిలో దమ్మల వీధిలో ఎస్ఐ రామారావు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గొంటివిధిలో సీఐ ఈశ్వరరావు, మహిళ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ చంద్రకళ, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు పట్టణంలోని పలు వార్డు ప్రజలకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై వివరించారు. చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో నడుచుకొని ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.

# మత్తు రహిత జిల్లాగా మారుద్దాం

* గంజాయి విక్రయిస్తే రౌడీషీట్ తెరవండి
* కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం




**శ్రీకాకుళం, నవంబర్ 8(వార్త):** గంజాయి, డ్రగ్స్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిర్మూలించి మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే వాటి వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకూ 37 కేసులు నమోదు చేశామని, 108 మందిని అరెస్టు చేయగా, అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. గంజాయి విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకుని, గంజాయి విక్రయిస్తున్న వారిపై సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్ తెరిచామన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి సంకల్పం పేరిట కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) నిరోధానికి చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 73 మంది పిల్లలను అక్రమ రవాణా నుంచి కాపాడగలిగామని, వారిలో 68 మందిని వారి తల్లిదండ్రుల వద్దకు చేరవేయగలిగినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, అలాగే డి-అడిషన్ కేంద్రాల సేవలకి టోల్ ఫ్రీ నెంబర్ 14446 పని చేస్తున్నదని పేర్కొన్నారు. తమ సమస్యలు, ఫిర్యాదులు ఈ నెంబర్ ద్వారా తెలియజేయవచ్చున్నారు. రిమ్స్ ఆసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ ను కూడా పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు సాధ్యా సాధ్యాలపై కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విశాఖపట్నం నుంచి సమావేశానికి హాజరైన రెవిన్యూ ఇంటిలెజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజా పుండ్కర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు ఒడిశాతో సరిహద్దు ఉందని అధికారులకు స్మగ్లింగ్ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, వారిని పట్టించేందుకు వ్యూహం రూపొందించాలన్నారు. డ్రగ్స్, బంగారం, జంతువుల చర్మాలు, కొమ్ములు, తదితర అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి నిర్మూలించాలంటే, దాని అక్రమ రవాణా నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, గణేష్, డీఎస్పీలు సిహెచ్. వివేకానంద, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, డీపీవో భారతి సౌజన్య, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీస్ ఇన్స్పెక్టర్లు, రవాణా, ఆర్టీసీ, ఎక్సైజ్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 17 నుంచి ధాన్యం సేకరణ

* రైతు పండించే ప్రతీ ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
* 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ
* ఒడిశా నుంచి ధాన్యం రాకుండా అడ్డుకోండి
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 8 (వార్త):** జిల్లా ఈనెల 17వ తేదీ నుంచి రైతులు పండించే ధాన్యాన్ని సేకరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసనసభ్యులతో కలసి శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న మూడు, నాలుగు నెలలు ఛాలెంజ్‌గా తీసుకొని ప్రతీ ధాన్యం గింజ రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యం సేకరణ ఒక పద్ధతి, విధానంలో సేకరించాలన్నారు. ఒడిశా నుంచి ధాన్యం రాకుండా నివారించాలని ఆదేశించారు. గత ఐదు సంవత్సరాలుగా ధాన్యం సేకరణ సక్రమంగా జరుగలేదన్నారు. మార్కెటింగ్, పిఎసిఎస్ లు, స్వయం సహాయక సంఘాలు ద్వారా ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ కేంద్రాలు ఎన్ని ఉండాలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు ఎలాంటి నియమ, నిబంధనలు ఉండవన్నారు. రైతులు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయించుకోవచ్చున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఏ రైస్ మిల్లు ఎన్ని ధాన్యాన్ని సేకరించిందో ఆ వివరాలను తెలియాలన్నారు. రైతు పండించిన ప్రతీ గింజ ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. రీ సైక్లింగ్ చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. జిల్లా రైతులు తడి ధాన్యాన్ని తీసుకు రాకూడదని, ధాన్యం తడిగా ఉంటే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని రైతులను ఆయన కోరారు. ఏ ఒక్క గింజ వదిలి పెట్టమన్నారు. గ్రేడ్ ఎ ప్రమోట్ చేయాలన్నారు. బ్యాంకర్లు గ్యారంటీలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నీరు అందక పంటలు పండని భూ వివరాలను మూడు రెవెన్యూ డివిజన్‌ల నుండి వివరాలు అందజేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. గొడౌన్స్ ప్రస్తుతం ఎన్ని నిర్మాణాలు పూర్తి అయ్యాయని మంత్రి అడుగగా ప్రస్తుతం పది గొడౌన్స్ పూర్తి చేయడమైనదని హౌసింగ్ పిడి తెలిపారు. ఈ యేడాది వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రైతులు పండించే ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కస్టోడియన్ ఆఫీసర్లు గా సి.యస్ డిటీలను నియమిస్తామన్నారు. ప్రతీ ధాన్యం సేకరణ కేంద్రాలకు కావలసిన సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో శాసన సభ్యులు గొండు శంకర్, నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, ఆర్డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డి.వెంకటేశ్వరరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ర్యాగింగ్ మితిమీరితే..

## ప్రిన్సిపాల్ జవాబుదారి

* జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు
* శివాని ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగంపై సదస్సు

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 8(వార్త):** విద్యాలయాల్లో ర్యాగింగ్ వీలైనంతవరకు జరగకుండా చూడాలని.. ఒకవేళ జరిగితే దానికి పూర్తి బాధ్యత ప్రిన్సిపాల్‌పైనే పడుతుందని సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. యువత భావితరాలకు ఆదర్శంగా నిలవాలి తప్ప నలుగురిలో అపహాస్యం పాల్పడకూడదని, తల్లిదండ్రులకు మచ్చతెచ్చేలా వ్యవహరించకూడదన్నారు. చిలకపాలెం లోని శివాని ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ యాక్ట్ పైన, డ్రగ్స్ పైన న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాలు వినియోగాలు ఎక్కువగా సాగుతున్నాయని వాటిని వీలైనంత వరకు అరికట్టించే బాధ్యత అందరిపైనా ఉంటుందని తెలిపారు. ఈ మత్తు పదార్థాలు మొదట సరదాగా తీసుకొని రానున్న రోజులలో దానిని అలవాటుగా చేసుకొని జీవితాలను అస్తవ్యస్తం చేసుకుంటున్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు ఎ.రాము, మాధురి, తేజ చక్రవర్తి, విజయ్ రాజ్, కుమారి కె.రాణి, ప్యానెల్ అడ్వకేట్ జి.ఇందిరప్రసాద్, శివాని కళాశాల సెక్రెటరీ కె.దుర్గశ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించండి



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 8(వార్త):** అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకు వెళ్లాలని, పార్టీలకతీతంగా అందరూ అభివృద్ధికి సహకరించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో 1వ, 2వ, 4వ, 7వ స్థాయి సంఘాల సమావేశాలు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. రణస్థలం జడ్పీటీసీ టొంపల సీతారాముడు, సరుబుజ్జిలి జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి టెండర్ ప్రక్రియలో మంచి ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డా.కళ్యాణ్ బాబు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే చేపడుతున్నామని, అందుకు అందరి సహకారం అవసరమన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఔట్ సోర్సింగ్ నియామకాలపై వివరాలు అడగ్గా డీఎంహెచ్‌వో నియామకాలు నిబంధనలకు లోబడి చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి ప్రకాశరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్న విషయాన్ని డాక్టర్ వ్యాధి నిర్ధారణ చేసిన తరువాత మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని. ప్రస్తుతం 3250 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి మాట్లాడుతూ గతంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన సమీక్షలో రణస్థలం జెడ్పిటిసి టొంపల సీతారాముడు మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు తవ్వించుకున్నారని, రైతులకు విద్యుత్ సరఫరా లేదన్నారు. ఈ స్థాయి సంఘ సమావేశాలకు జడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు, పాలిన శ్రావణి, జడ్పీటీసీ సభ్యులు, పర్యవేక్షక ఇంజినీర్లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు, భవనాలు, విద్యుత్, నీటి పారుదల శాఖలు, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, బీసీకార్పొరేషన్, వ్యవసాయ శాఖ, ప్రణాళిక శాఖ, పట్టుపరిశ్రమ శాఖా, జిల్లా ఉద్యానవన శాఖ, అదనపు అటవీ శాఖ, జిల్లా గ్రామీణ నీటి యాజమాన్యసంస్థ, జిల్లా పంచాయతీ, ఐసీడీఎస్, గృహనిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ

* నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీసీపై కేసులు
* 1033 హెల్ప్‌లైన్ బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, నవంబర్ 8 (వార్త):** రహదారుల భద్రతే.. జీవితాలకు రక్షణగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహ దారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ కమిటీ చైర్మన్‌గా, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, కమిటీ మెంబర్ కన్వీనర్, డిటీసీ విజయ సారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం నగరం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇకపై తమ్మినాయుడుపేట వైపు రాంగ్ రూట్‌లో వెళ్లి జాతీయ రహదారి పైకి వెళ్లరాదని ఆర్టీసీ అధికారులను హెచ్చరించారు. సర్వీసు రోడ్డులోని వెళ్లాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీసీ బస్సులపై ఇక నుంచి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కఠినతరం చేయాలన్నారు.జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ల లోనూ, 158 సున్నితమైన ప్రాంతాలలోనూ చేపట్టిన రక్షణ చర్యలపై చర్చించారు. నవ భారత జంక్షన్ వద్ద అధికారుల బృందం పర్యటించి విస్తరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే సం బంధిత ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులపై కూడా చర్యలు తప్పవన్నారు. 1033 హెల్ప్ లైన్ బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలని, కాల్ సెంటర్లో తెలుగు మాట్లాడే వారు ఉండేలా చూడాలని చెప్పారు. మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించడం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయ సారథి, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, డి.ఎం.హెచ్.ఓ డా.బి.మీనాక్షి, డీఎస్పీ వివేకానంద, డీపీవో భారతి సౌజన్య, ఆర్డీవోలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**జలుమూరు, నవంబర్ 8(వార్త):** మోటార్ వాహనాల చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన చల్లపేట జంక్షన్ వద్ద వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకపోవడంతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

# ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు



**కొత్తూరు, నవంబర్ 8(వార్త):** అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. మాతలలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులోకి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకు వచ్చి కార్మికులకు బాసటగా నిలిచినా ఏకైన ప్రభుత్వం తమదన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. భోగాపురం నూతన విమానాశ్రయం పనులు త్వరితగతిన చేపడుతున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధుల పింఛన్‌ను రూ.4 వేలకు, వికలాంగుల పింఛన్ రూ.6 వేలు చేసిన ఘనత తమదే అన్నారు. గత ఐదేళ్లలో నిరక్ష్యానికి గురైన శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేశామన్నారు. గతంలో నిలిచిపోయిన నీరు-చెట్టు పనుల బిల్లులను 12% వడ్డీతో చెల్లించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమన్నారు. వైసీపీ నాయకులు తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## లారీ ఢీకొని..ఇద్దరికి గాయాలు



**పలాస, నవంబర్ 8 (వార్త):** లారీ ఢీకొనడంతో ఇద్దరు గాయాల పాలయ్యారు. గరుడగండి గ్రామస్తులు అప్పలస్వామి, కృష్ణ పలాసకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. పాత మెయిన్ రోడ్డు గరుడ గండి వద్ద లారీ ఢీకొంది. దీంతో వారు గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందివ్వగా, ఆ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# 24, 25న హరిపురంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కిశోర్

**మందస, నవంబర్ 8(వార్త):** హరిపురంలో ఈనెల 24, 25వ తేదీల్లో యూటీఎఫ్ జిల్లా విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నాయని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. శుక్రవారం హరిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మందస మండల శాఖ అధ్యక్షుడు జగదీష్ బడిత్య అధ్యక్షతన ఈ మహాసభల సన్నాహక సమావేశం జరిగింది.

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్య లపై దిశా నిర్దేశం చేస్తూ, ఆమోదం పొందిన పలు తీర్మానాలు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ స్వర్ణోత్సవ మహాసభలు ఉపాధ్యాయుల్లో చైతన్యం నింపడంతో పాటు విద్యాభివృద్ధికి దోహదకారిగా ఉండేటట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, అకడమిక్ సెల్ కన్వీనర్, కో కన్వీనర్లు ఎల్వీ చలం, కె.మాధవరావు, పూర్వపు జిల్లా కార్యదర్శులు ఆర్.పరమేశ్వరరావు, కె.రమేష్, మందస, పలాస శాఖల ప్రధాన కార్యదర్శులు దాసరి ఈశ్వరరావు, ఎస్వీ రమణ, సిద్దేశ్వరరావు, ఆపోటా నాయకులు అరుణ్ కుమార్ పాడి, సహాధ్యక్షులు గంట గోపాలకృష్ణ, ప్రియాంక మహారాణా, మహిళా కన్వీనర్ ఎస్.పద్మసుందర్, సీనియర్ నాయకులు పి.కొండలరావు, కె.సోమేశ్వరరావు నిర్వహణకు పలు సూచనలు చేశారు.


కార్యక్రమంలో సీనియర్ యూటీఎఫ్ నాయకులు జె.సోమేశ్వర రావు, ఎల్.రాజారావు, కె.శ్రీనివాస రావు, రామారావు, జి.రమణబాబు, ఎం.శివకేశవరావు, బాల అర్జున పాత్ర, టి.గంగారావు, టి.సోమేశ్వరరావు, ఎస్.శ్రీహర్ష, ఆర్.గోవింద్, కె.లెనిన్ బాబు, డి.కిరణ్, జి.చంద్రశేఖర్, టి.రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్ ప్రధాన్, పి.జగన్మోహనరావు, టి.జయరాం తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ అధ్యక్షుడికి కృష్ణదాస్ పరామర్శ



**జలుమూరు, నవంబర్ 8(వార్త):** నరసన్నపేట మండలం చిన్న బొరిగివలస పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడుని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ ఆరంగి మురళీధర్, మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, సర్పంచ్‌లు బురల్లి శంకర్, పొన్నాన ప్రసాద్, పొన్నాన దాలినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పాగోటి భరద్వాజ్, పట్టణ యువజన అధ్యక్షుడు బుద్దుల రాజశేఖర్, వార్డు సభ్యులు పాపారావు, పంచాయతీ నాయకులు ఉన్నారు.

## పిల్లలకు పాలిచ్చే వసతి గది ప్రారంభం



**జలుమూరు, నవంబర్ 8(వార్త):** మహిళా ప్రయాణికులు పిల్లలకు పాలిచ్చేందుకు వసతి గది ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం ఆమన నరసన్నపేటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆ గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ఈ వసతి కల్పిస్తున్నామని చెప్పారు.

# సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి




మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**మందస, నవంబర్ 8(వార్త):** సీపీఎం జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు హెచ్.అమ్మన్నాయుడు, ఆర్.దిలీప్‌కుమార్ కోరారు. సీపీఎం జిల్లా మహాసభల జయప్రదానికి మందస, హరిపురం, భైరిసారంగపురం, బహడపల్లి, రట్టి, బేతాళపురం, సువర్ణపురం తదితర గ్రామాల్లో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శని, ఆదివారాల్లో పలాసలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం 10గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రదర్శన అనంతరం కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగా సంత మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని, రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యుడు బి.తులసీదాసు ప్రసంగిస్తారన్నారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పలాసలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ కేంద్రం, ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలన్నారు. అవసరమైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని, ఉద్దానం గ్రామాలు, పలాసకు మంచినీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను సత్వరమే పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాల్లో కారిడార్ల పేరుతో రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. అధిక ధరలతో ఒక వైపు, ఆదాయాలు తరిగిపోయి మరో వైపు సతమతమవున్న ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.11 వేల కోట్లు, రూ.6వేల కోట్లు ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారం వేయడానికి ప్రభుత్వం సిద్ధమవ్వడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ భారాన్ని ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ప్లాంట్ ప్రైవేటీకరించి అంబానీ, అదానీలకు అప్పగించడానికి తీవ్ర కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు టి.భాస్కరరావు, ఆర్.దిలీప్‌కుమార్, ఎం.ధర్మారావు, కళాసీ సంఘం నాయకులు పి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పొలాలకు రహదారి కల్పించండి

**జలుమూరు, నవంబర్ 8(వార్త):** నరసన్నపేట మండలం కిల్లాం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారిలో ముళ్ల కంపలు పేరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బోడి రామన్న తెలిపారు. వరి పొలాలు కోతకు వచ్చాయని, వాటిని గ్రామాల్లోకి తెచ్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీంతో శుక్రవారం స్థానిక రైతులే శ్రమదానం చేసి రహదారిని శుభ్రం చేశారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 'పాస్ పుస్తకాల్లో మార్పులకే గ్రామ సభలు'

**జలుమూరు, నవంబర్ 8(వార్త):** రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులను సరిదిద్దేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన జలుమూరు మండలం సురవరంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు భూ విస్తరణ, పేర్లు మార్పు తదితర విషయాలపై తమకు అర్జీలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





## సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు

**జలుమూరు, నవంబర్ 8(వార్త):** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు సెలవు దినాల్లో కూడా క్లాసులు పెడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన.. ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవోలు తనిఖీలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



**జలుమూరు, నవంబర్ 8(వార్త):** క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులువుగా చికిత్స చేయవచ్చని చిక్కాలవలస సచివాలయ సీహెచ్ బి.నీలిమ అన్నారు. శుక్రవారం ఆమె నరసన్నపేట మండలం చిక్కాలవలసలో ఆశ కార్యకర్తలతో క్యాన్సర్‌పై అవగాహన రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగ తాగడంతో 70 శాతం, ఆహారపు అలవాట్లతో 20 శాతం, ఇతర కారణాలతో 10 శాతం క్యాన్సం వస్తుందన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తుందని తెలిపారు.

## టీడీపీ నేత రుద్రయ్యకు మాతృ వియోగం



లబ్బ పోలమ్మ(ఫైల్)

**మందస, నవంబర్ 8(వార్త):** తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మండల ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్యకు మాతృ వియోగం కలిగింది. వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మాతృమూర్తి లబ్బ పోలమ్మ(80) శుక్రవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలమ్మ కుటుంబాన్ని టీడీపీ నాయకులు పరామర్శించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**పోలాకి, నవంబర్ 8(వార్త):** పోలాకి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రియాగ్రహారంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. దొంగతనాలపై స్థానికులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానితులను వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యానికి కృషి చేయాలని యువతను కోరారు.

**ఇచ్ఛాపురం:** దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ ఈమంది శ్రీనివాసరావు చెప్పారు. ఆయన శుక్రవారం రాత్రి బాలకృష్ణాపురంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



# అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం



**టెక్కలి, నవంబర్ 8(వార్త):** న్యాయం దృష్టిలో అందరూ సమానులే అని, అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని టెక్కలి ఫుల్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జె. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం టెక్కలిలోని ఆది ఆంధ్ర వీధిలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు న్యాయ సేవల లభ్యత, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పౌరుడు ఆర్థిక కారణాలతో న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉచిత న్యాయ సహాయం అందించాలని ప్రభుత్వం న్యాయసేవల అధికారికుల చట్టం రూపొందించిందని తెలిపారు. రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులు కూడా పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడుపైన ఉందన్నారు. చట్టం ముందు అందరు సమానమే అని, వ్యక్తులపై కుల, మత, వర్గ, వర్ణ, వివక్ష చూపరాదన్నారు. అంటరానితనం నేరమని, ప్రతి ఒక్కరినీ గౌరవించాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, జీవితంలో విద్య ద్వారా ఎన్నో విషయాలు సాధించవచ్చని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. సదస్సులో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేకానంద, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.అప్పారావు, వార్డెన్ బి.గణపతి, టెక్కలి పట్టణ ఏఎస్ఐ కేశవ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం చూపాలి




**కాశీబుగ్గ, నవంబర్ 8(వార్త):** ఉద్దానంలో కిడ్నీ వ్యాధి సమస్య పరిష్కారానికి పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పలాస సూదికొండ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఉద్దానంలో కిడ్నీ రోగులు పిట్టల రాలుతున్నా పాలకులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు కిడ్నీ వ్యాధితో 40మంది వరకు ప్రజలు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ పాలకులు ఈ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించాయని మండిపడ్డారు. కిడ్నీ వ్యాధి మూలాలు శోధించడానికి పరిశోధన కేంద్రం పేరుతో ఏర్పాటుచేసిన హాస్పిటల్ సాధారణ వైద్యానికే పరిమితమైందని విమర్శించారు. పరిశోధన శాస్త్రవేత్తలు లేరని, ప్రత్యేకమైన బడ్జెట్ లేదని ఆరోపించారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి మూలాల శోధనపైన ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. డయాలసిస్‌లు, కిడ్నీ రోగులకు పెన్షన్ల ద్వారా కొంత ఊరట లభిస్తుందే తప్ప, సమస్య పరిష్కారం కాదన్నారు. భవిష్యత్ తరాలను కాపాడుకోవడానికి అన్ని గ్రామాలకు శుద్ధజలంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని కోరారు. జీడి మామిడి, కొబ్బరి తదితర పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, జిల్లా నాయకురాలు టి.సంస్వతి, ఇఫ్టూ నేతలు పతివాడ షణ్ముఖరావు, ఆనంద్ బెహరా పాల్గొన్నారు

# పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టండి



**వంగర, నవంబర్ 8(వార్త):** వంగర మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా సంపూర్ణ పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎంపీడీవో ఎల్.త్రినాథరావు, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఈవోపీఆర్డీ కెల్ల రామారావు కోరారు. శుక్రవారం వారు తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్యం లోపిస్తే ఎలాంటి వ్యాధులు సంభవిస్తాయో అందరికీ తెలుసని, అన్ని గ్రామాల్లో కూడా ఇంటింటికీ తిరిగి పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకొని పని చేయాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం, కలెక్టర్.. దీనిపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని, కలిసికట్టుగా కృషి చేద్దామని తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వైస్సార్సీపీ సీనియర్ నేత కాళ్ల దేవరాజు కన్నుమూత




**ఇచ్ఛాపురం, నవంబర్ 8(వార్త):** వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు కాళ్ల దేవరాజు ( 64) శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. అనంతరం రాజకీయాలపై మక్కువతో తెలుగుదేశంలో చేరారు. పట్టణ అడహాక్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2000లో చైర్మన్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో కీలకం గా వ్యవహరించారు. అనంతరం వైసీపీలో చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు మదన్, భాను ఉన్నారు. దేవరాజు మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

# మందసలో మళ్లీ దొంగలు పడ్డారు

### -వరుస ఘటనలతో ప్రజలు బెంబేలు

**మందస, నవంబర్ 8(వార్త):** మందస మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రజలను కలవరపెడుతున్నాయి. మందస, హరిపురంతో పాటు గ్రామాల్లో కూడా చోరీలు చోటుచేసుకుంటున్నాయి. ఇళ్లల్లో యజమానులు లేని సమయంలో రెక్కీ చేసి మరీ డబ్బు, నగలు దోచుకుపోతున్నారు. అంతేగాకుండా ద్విచక్రవాహనాలు, వాటి భాగాలను కూడా రాత్రి వేళల్లో తస్కరిస్తున్నారు. ఇంటి ముందు నిలిపిన వాహనాల నుంచి రాత్రి సమయంలో పెట్రోలును కూడా దొంగలిస్తున్నారు. ఇటీవల మందసలో కొన్ని షాపుల తలుపులు విరగ్గొట్టి, దొంగతనాలకు పాల్పడ్డారు. ఇవన్నీ పథకం ప్రకారమే జరుగుతున్నట్టు ప్రజలు అనుమానిస్తున్నారు. మందసకు చెందిన పట్నాయిక్ సుమారు 15 రోజుల క్రితం కుటుంబంతో క్యాంప్ వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటిలో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. సుమారు రూ. 60వేలు అపహరించేశారు. బంగారు నగలు దొంగలించడానికి దొంగలు విఫలయత్నం చేసినట్టు తెలుస్తోంది. ఎన్నడూ లేని విధంగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సొండిపూడిలో దొంగల నుంచి స్వాధీనంచేసుకున్న దొంగతనానికి వినియోగించే పరికరాలు(ఫైల్)

## ద్విచక్ర వాహనంపై దుండగుల దాడి



**మెళియాపుట్టి, నవంబర్ 8(వార్త):** మెళియాపుట్టిలో ఓ ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనంపై పలువురు దాడికి పాల్పడ్డారు. గురువారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండుల కమిటీ చైర్మన్ బూరగాన చిన్నబాబుకి చెందిన ద్విచక్ర వాహనంపై దుండగులు దాడి చేసి, ధ్వంసం చేశారు. దీంతో ఆందోళన చెందిన ఆయన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు సంఘటనా స్థలిని పరిశీలించారు. పలు వివరాలను తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా కొన్నాళ్లుగా పలువురు గంజాయి తదితర మత్తు పదార్ధాలకు లోనై వీర విహారం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ప్రజలు వాపోతున్నారు. వారే ఇటువంటి చర్యకు పాల్పడి ఉండొచ్చని, పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తే, మరిన్ని వాస్తవాలు బయటికి వస్తాయని వారంటున్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా, ప్రజలకు భయభ్రాంతులకు గురికాకుండా వారు వారు చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## వచ్చే ఏడాది గ్లోబల్ జూనియర్ కళాశాల ప్రారంభం




శ్రీకాకుళం టౌన్, నవంబర్8(వార్త): గ్లోబల్ విద్యాసంస్థలు మరో మైలురాలు చేరనుంది. 2025-26 సంవత్సరంలో గ్లోబల్ జూనియర్ కాలేజ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లు జిల్లాలో ప్రారంభిస్తున్నామని గ్లోబల్ విద్యాసంస్థల యాజమాన్యం సభ్యులు తెలిపారు. ఐఐటీ, నీట్‌లో ఎంతోమంది విద్యార్థులను ర్యాంకర్లుగా తయారుచేసిన కెమిస్ట్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి తరగతి గదిలో 30 మంది విద్యార్థులు ఉండేటట్లు చూస్తామన్నారు. రెండు దశాబ్దాలు అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యా బోధన అందించడం, డౌట్స్ క్లారిఫికేషన్ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఫ్యాకల్టీ, విద్యార్థినిపై ఒత్తిడి లేకుండా రూపొందించే అకడమిక్ కరికులం, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో ర్యాంకర్లుగా తయారు చేయడం, గ్లోబల్ విద్యాసంస్థల ముఖ్య ఉద్దేశమన్నారు. తమ పాఠశాలలను ఆదరించినట్లే ..కళాశాలను జిల్లా ప్రజలు ప్రోత్సహించాలని వారు కోరారు.

## గ్రామాల్లో జియో ట్యాగింగ్ సర్వే

**వంగర, నవంబర్ 8(వార్త):** వంగర మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటికి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ఈ సర్వే చేస్తున్నా రు. జియో ట్యాగింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీని ఆధారంగా డేటాబేస్ నమోదు చేయాలని .. తాజాగా వార్డు, గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం మగ్గూరు గ్రామ పంచాయతీలో వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఈ సర్వే చేపట్టారు.



# కుక్కివన్‌లో.. కుర్రాళ్లు కుమ్మేశారు..!

■ ప్రతిభ చాటిన సిక్కోలు యువత ■ తైక్వాండోలో నెలరోజుల పాటు అంతర్జాతీయ శిక్షణ ■ సన్‌గా ఎంపిక



శ్రీకాకుళం, నవంబర్8(వార్త):ఒలింపిక్ క్రీడ తైక్వాండోకు పుట్టినిల్లు దక్షిణ కొరియాలోని కుక్కివన్. అలాంటి నగరంలో జిల్లా నుంచి ముగ్గురు యువ క్రీడాకారులు నెల రోజులు శిక్షణ పొందారు. శ్రీకాకుళం నగరానికి చెందిన కొమర మోహన్ కృష్ణ, కారె మోక్షిత్, కారే సాక్షిత్ అక్కడ శిక్షణ పొంది గురువారం విశాఖకు చేరుకున్నారు. జిల్లా పేరును జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లిన వీరికి ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఘన స్వాగతం పలికింది. జిల్లా వర్ధమాన క్రీడాకారులు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని తమకు ఆదర్శంగా నిలిచిన ఆ ముగ్గురు క్రీడాకారులకు జేజేలు పలికారు.

### సన్‌గా అవకాశం..

శిక్షణలో పది రోజులకే అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కొమర మోహనకృష్ణను వరల్డ్ తైక్వాండో న్యూ ప్రెసిడెంట్ గ్రాండ్ మాస్టర్ లీడాంగ్ సప్ సత్కరించారు. ఆయనకు ఎంతో అపురూపమైన వరల్డ్ తైక్వాండో చిహ్నంను బహుకరించారు. ఈ అవకాశం దొరకడం.. క్రీడాకారులకు అందులోనూ భారతీయ క్రీడాకారులకు చాలా అరుదు. ఈ చిహ్నం దక్కడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తారు. అంతర్జాతీయ శిక్షణ అందించిన గ్రాండ్ మాస్టర్‌కు ప్రతి దేశంలోనూ తైక్వాండో సన్ ఉంటారు. మన దేశానికి సంబంధించి కొమర మోహనకృష్ణను సన్‌గా స్వీకరించారు.

### ఘన స్వాగతం ..



నెలరోజుల పాటు దక్షిణకొరియాలో శిక్షణ పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చిన ముగ్గురు క్రీడాకారులకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో న్యూ ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చంనాయుడు, రాష్ట్ర ఉషు అసోసియేషన్ సహాయ కార్యదర్శి రెడ్డి శివకుమార్, కురిటి తారకరామ, సాయిరాం మురళి, సీనియర్ ప్లేయర్స్ శంకర్, గోపి, నవీన్ స్వాగతించారు.

### అభినందనల వెల్లువ..

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మాన కృష్ణ దాస్, మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు, డీఎస్‌డీవో శ్రీధర్, పలు క్రీడా సంఘాలు క్రీడాకారులను అభినందించారు. మోహనకృష్ణ తండ్రి, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొమర భాస్కరరావును ప్రత్యేకంగా అభినందించారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413